

నిధులు మళ్లీ వచ్చాయి : మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్, ఫిబ్రవరి 22: నర్సాపూర్ మున్సిపాలిటీలో ప్రభుత్వం మారడంతో తాత్కాలికంగా నిలిచిపోయిన టీయూఎఫ్ఐడీసీ నిధులు తిరిగి విడుదలైనట్టు మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ గురువారం ప్రకటనలో తెలిపారు. నిధులు తిరిగి వెళ్లడంపై ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, మున్సిపల్ ప్రత్యేక సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి విన్నవించామని ఆయన తెలిపారు. దీంతో నిలిచిపోయిన రూ.30.95 కోట్ల నిధులు తిరిగి కేటాయిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని చైర్మన్ తెలిపారు.



మారనున్న రూపురేఖలు

- అమృత్ భారత్ స్టేషన్‌గా మెదక్ ఎంపిక
- రూ.15.29 కోట్లతో అభివృద్ధి పనులు
- ఈ నెల 26న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న ప్రధాని

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 22: నగరాలు, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి అమృత్ పథకాన్ని అమలు చేస్తున్న కేంద్ర సర్కారు.. ఇదే తరహాలో రైల్వేస్టేషన్ల ఆధునికీకరణకు అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ ప్రారంభించింది. దేశ వ్యాప్తంగా 554 స్టేషన్లను ఎంపిక చేయగా హైదరాబాద్ డివిజన్‌లో 10 స్టేషన్లు ఆ జాబితాలో ఉన్నాయి. ఇందులో మెదక్ రైల్వేస్టేషన్‌కు కూడా చోటు దక్కడంతో స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌కు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించింది. ఈ పథకంలో ఎంపికైన మెదక్ రైల్వేస్టేషన్‌లో రూ.15.29 కోట్లతో మౌలిక సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు. ఏడాది కాలంలో పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ నెల 26న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా పనులకు శంకుస్థాపన చేసి జాతికి అంకితం చేయనున్నారు.

ఏయే పనులు చేస్తారంటే..

మెదక్ రైల్వేస్టేషన్ రూపురేఖలు మార్చేలా ఈ పథకంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. పార్కింగ్‌షెడ్‌ల నిర్మాణం, ప్లాట్‌ఫారాలపై ప్రొవిజన్‌కవర్, 4 స్పాన్‌లు, ట్రాక్‌ల శుభ్రత, సులభమైన బ్యాలస్ట్‌లెస్ ట్రాక్‌లు, దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీలు, ప్రవేశమార్గాల్లో ర్యాంపులు, మరుగుదొడ్లు, జనరేటర్, ల్యాండ్‌స్కేపింగ్, సాంకేతిక వ్యవస్థ సెల్ఫీపాయింట్, సమాచార బోర్డులు, ఆధునిక లైటింగ్ తదితర పనులు చేపట్టనున్నారు.

5.99 కోట్లు



సంగారెడ్డిలో ఇస్త్రీ చేస్తున్న రజకుడు

సెలూన్లు, లాండ్రీల కరెంటు బకాయిలు

సంగారెడ్డి జిల్లాలో రూ.2.31 కోట్లు.. మెదక్ జిల్లాలో రూ.3.68 కోట్లు

ఏడాదిగా విద్యుత్ సంస్థలకు చెల్లించని ప్రభుత్వం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 22: ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ఫ్రీకరెంటు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండగా.. గత సర్కారు వివిధ వర్గాలకు ఇస్తున్న ఫ్రీ కరెంటు బకాయిల మాటేమిటని విద్యుత్ సంస్థలు ప్రశ్నిస్తున్నాయి. గత సర్కారు సెలూన్లు, దోబీఘాట్లు, లాండ్రీషాపులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నది. ఇలా సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సెలూన్లు, దోబీఘాట్లు, లాండ్రీషాపులకు వినియోగించిన కరెంట్‌కు ప్రభుత్వం రూ.5.99 కోట్ల బకాయిలను విద్యుత్‌సంస్థకు చెల్లించాల్సి ఉన్నది.





మెదక్ జిల్లాలో 961 సెలూన్లు, 2244 దోబీఘాట్లు, లాండ్రీషాప్‌లు ఉన్నాయి. వీరు వినియోగించిన కరెంట్‌కు బిల్లులను 2021 ఏప్రిల్ నుంచి ప్రభుత్వమే విద్యుత్‌సంస్థకు చెల్లిస్తున్నది. లాండ్రీలు, దోబీ ఘాట్లకు సంబంధించి బిల్లులను 2023 ఫిబ్రవరి వరకు, సెలూన్లకు సంబంధించిన బిల్లులను 2023 జూన్ వరకు చెల్లించింది. అప్పటి నుంచి కరెంట్ బిల్లులను ప్రభుత్వం విద్యుత్ సంస్థకు చెల్లించడం లేదు.

రూ. కోట్లలో బకాయిలు

సంగారెడ్డి జిల్లాలో సెలూన్లు, దోబీఘాట్లు, లాండ్రీల నిర్వహణకు సంబంధించిన కరెంట్ బకాయిలు రూ.2.31 కోట్లు ఉన్నాయి. ఇందులో దోబీ ఘాట్లు, లాండ్రీషాప్‌లకు సంబంధించిన బకాయిలు రూ.1.77 కోట్లు, సెలూన్లకు సంబంధించిన రూ.53.36 లక్షల బిల్లులు బకాయి ఉన్నాయి. అలాగే, మెదక్ జిల్లా రూ.3.68 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. మెదక్ జిల్లాలో సెలూన్లు, దోబీఘాట్లు, లాండ్రీలకు సంబంధించి కరెంట్ బిల్లుల బకాయిలు రూ.3.68 కోట్లు పేరుకుపోయాయి. ఇందులో సెలూన్ల బకాయిలు రూ.2.09 కోట్లు, దోబీఘాట్లు, లాండ్రీల బకాయిలు రూ.1.59 కోట్లు ఉన్నాయి.

స్పందించని సర్కారు

సెలూన్లు, దోబీఘాట్లు, లాండ్రీల కరెంట్ బకాయిలు చెల్లించాలంటూ విద్యుత్‌సంస్థ పలుమార్లు లేఖలు రాసినా ప్రభుత్వం స్పందించ లేదని తెలిసింది. విద్యుత్ సిబ్బంది మాత్రం ప్రతీ నెలా సెలూన్ల, దోబీఘాట్ల, లాండ్రీషాప్‌ల మీటర్ రీడింగ్ నమోదు చేసి బిల్లులను పంపిస్తున్నారు. కానీ, నిర్వాహకులు ఈ బిల్లులను చెల్లించడం లేదు. ఒక్కో దుకాణంపై బకాయిలు రూ. వేలల్లో పేరుకుపోవడంతో నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. బిల్లులపై అధికారులను అడిగితే మీరేమీ కట్టొద్దు.. ప్రభుత్వమే చెల్లిస్తుందేమో చూద్దామని చెప్పి పంపిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరాను నిలిపివేయకపోయినా బకాయిలు పేరుకుపోవడం ఆందోళన కలిగిస్తుందని వారు వాపోతున్నారు.

పటాన్‌చెరు మండలంలోని ఓ మైనింగ్ కంపెనీ



మైనింగ్ మాఫియా గుండెల్లో గుబులు

- దృష్టిసారించిన మంత్రి.. ఐదు క్రషర్లు సీజ్
- అక్రమ క్వారీలతో భద్రత లేని బతుకులు
- తప్పుదోవ పట్టించిన ప్రజాభిప్రాయ సేకరణలు

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 22: మైనింగ్ మాఫియాపై సర్కారు దృష్టిసారించడంతో పటాన్‌చెరు మండలంలో పలు గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. మంత్రి ఆదేశాలతో అధికార యంత్రాంగం క్వారీలను పరిశీలించి, అక్రమాలపై చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే 5 స్టోన్‌క్రషర్లను సీజ్ చేశారు. పలు మైనింగ్ కంపెనీలపై కేసులు నమోదు చేశారు.

ఇళ్లు.. ఒళ్లు గుల్ల

నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న అక్రమ క్వారీల కారణంగా మండలంలో పలు గ్రామాల ప్రజల బతుకులకు భద్రత లేకుండాపోయింది. కాలుష్యం బారినపడి ఆరోగ్యం, నీటి వనరులను కోల్పోతున్నారు. నిర్లక్ష్యంగా, అతివేగంగా నడుస్తున్న టిప్పర్ల మధ్య నలిగిపోయిన బతుకులెన్నో ఉన్నాయి. ఇస్నాపూర్, పటాన్‌చెరు, లక్డారం, రుద్రారం తదితర గ్రామాల పరిధిలో జరిగిన ప్రమాదాల్లో ఎక్కువగా కంకర టిప్పర్ల కారణంగా జరిగినవే. దీనికి తోడు కంకర క్వారీల నుంచి వచ్చే దుమ్ము చుట్టుపక్కల పంట పొలాలను కమ్మేయడంతో వ్యవసాయం కుంటుపడింది. ఇష్టారాజ్యంగా చేసిన బ్లాస్టింగ్‌ల వల్ల సమీప గ్రామాల్లో ఇళ్లు బీటలువారాయి. దీనిపై ప్రజలు మొరపెట్టుకున్నా గత ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు.

ప్రహసనంగా ప్రజాభిప్రాయ సేకరణ

కొత్త క్రషర్ల అనుమతుల విషయంలో ప్రభుత్వం అట్టహాసంగా చేపడుతున్న ప్రజాభిప్రాయ సేకరణ ప్రహసనంలా సాగింది. స్థానికుల అభిప్రాయం తెలుసుకోవాల్సిన అధికారులు స్థానికేతరులకు కూడా అవకాశాలు కల్పించడంతో ఎన్జీవోల సంఘాలు, ప్రజా సంఘాలు అంటూ రంగంలోకి దిగిన పలు ముఠాలు ఈ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని యజమానులకు అనుకూలంగా వత్తాసు పలకడంతో స్థానికుల మొర వినే నాథుడే కరువయ్యాడు. దీనికి తోడు స్థానిక నేతలు కొంతమంది యాజమాన్యాలకు వంత పాడారు. మొన్నటి వరకు స్థానికులు, పర్యావరణ వేత్తలు ఎంత మొత్తుకున్నా క్రషర్ల నిర్వాహకులు కనీసం పట్టించుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా తమకు కేటాయించిన భూమి కంటే అదనంగా ఎకరాలకు ఎకరాలు కబ్జా చేసి దర్జాగా మైనింగ్ చేశారు. ప్రభుత్వం మారడంతో, మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్వారీలపై చర్యలు చేపట్టారు. మొత్తం క్రషర్లను తనిఖీ చేసి క్రషర్ల అక్రమార్కులపై నివేదిక రూపొందించిన అధికారులు ఇప్పటికే ఐదు క్రషర్ల (సంతోష్ సాండ్ గ్రానైట్ సప్లై సంస్థతో పాటు ఆస్త్రా రాక్ మైనింగ్ ఇండస్ట్రీస్, లారా స్టోన్ క్రషర్స్, శ్రీ రామ స్టోన్ క్రషర్స్ ఖడా మైనింగ్)ను సీజ్ చేశారు. దీంతో మైనింగ్ మాఫియా గుండెల్లో గుబులు మొదలైంది.

అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం

సంగారెడ్డి టౌన్, ఫిబ్రవరి 22: సంగారెడ్డి డివిజన్ పరిధిలో అక్రమ మైనింగ్‌పై ఉక్కుపాదం మోపుతున్నామని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం ఆయన పటాన్‌చెరు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్ డీఈ రామస్వామితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి నేతృత్వంలో అక్రమ మైనింగ్, చెరువుల సంరక్షణ కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశారని తెలియజేశారు. సంగారెడ్డి డివిజన్ పరిధిలోని లక్డారం, ఖాజిపల్లి, మాదారం, సోలక్‌పల్లి, ఊట్ల, నల్లూరు, కొడకంచి, రుద్రారం, చిట్కుల్ తదితర గ్రామాల పరిధిలో మొత్తం 78 మైనింగ్ కంపెనీలున్నట్టు గుర్తించామని తెలిపారు. ఇందులో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న 5 కంపెనీలను మూసివేశామని చెప్పారు. అలాగే అధిక లోడ్‌తో వెళ్తున్న 79 వాహనాలను గుర్తించి వాటి నుంచి రూ.22 లక్షల జరిమానా విధించామని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన కంపెనీలపై ఆయా శాఖల పరిధిలో 26 పోలీసు కేసులు నమోదు చేశామని, మరికొన్నింటికి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. ఇవేకాకుండా 20 మైనింగ్ కంపెనీలు 179 హెక్టార్ల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు గుర్తించినట్లు తెలిపారు. పటాన్‌చెరు మండలం లక్డారం, రుద్రారం, చిట్కుల్ పరిధిలోని 24 క్రషర్లలో 149 హెక్టార్ల ప్రభుత్వ భూమిని అక్రమించినట్లు తేలిందని ఆర్డీవో రవీందర్‌రెడ్డి తెలిపారు. వీటిపై త్వరలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఇంటర్ ఎగ్జామ్స్‌కు 52 సెంటర్లు.. పరీక్ష రాయనున్న 36,153 విద్యార్థులు

టెన్త్ పరీక్షలకు 121 కేంద్రాలు, 22,045 మంది..

నాణ్యమైన ఫలితాలు వచ్చేలా చర్యలు : సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22: ఇంటర్మీడియేట్, పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులతో గురువారం ఆమె కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 52 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, 36,153 మంది పరీక్షలకు హాజరుకానున్నారని చెప్పారు. వచ్చే నెల 18 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 121 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. 22,045 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని, వీరిలో 11,134 మంది బాలురు, 10,911 మంది బాలికలు ఉన్నట్లు వెల్లడించారు. ప్రశ్నాపత్రాలను భద్రపర్చేందుకు 17 పోలీస్‌స్టేషన్లను గుర్తించామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఫర్నిచర్, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు తదితర సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద అత్యవసర మందులతో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ గాయత్రిని ఆదేశించారు. పరీక్షలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా బస్సులను నడపాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌ను అటికట్టడానికి తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని, కాపీయింగ్ జరిగినట్టు తెలిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడం కంటే.. నాణ్యమైన ఫలితాలు వచ్చేలా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు ఎస్పీ సంజీవ్‌రావు, డీఈవో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు రవీందర్‌రెడ్డి, రాజు, పాండు, విద్యుత్‌శాఖ టెక్నికల్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎంవీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని అధికారులను సంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో గురువారం ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో ఆమె మాట్లాడారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతో ఎన్నికల విధులు మొదలుపెట్టాలని సెక్టార్ అధికారులను ఆదేశించారు. పార్లమెంటు ఎన్నిలను సమర్థంగా పూర్తిచేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఎండబ్ల్యూవో దేవుజా, ఆర్డీవోలు రవీందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజు, పాండు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



విద్యాశాఖ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

మైనర్లూ జాగ్రత్త!

- వారికి వాహనాలు ఇస్తే యజమానిపై చర్యలు
- కొత్త విధానంపై పోలీసుల కసరత్తు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 22: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా బైకులు, కార్లను నడిపే మైనర్లపై పోలీసులు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నారు. మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే తల్లిదండ్రులను జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. సిద్దిపేట జిల్లాలో గతంలో మైనర్ డ్రైవింగ్ పలువురి ప్రాణాలను తీసింది. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని మైనర్ డ్రైవింగ్ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. దీనికి సంబంధించిన కేసుల్లో వాహన యజమానిపై కేసు నమోదుచేసి కోర్టుకు పంపేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విధానాన్ని మరి కొద్దిరోజుల్లో అమలులోకి తీసుకురానున్నారు.

మోటార్ వాహనచట్టం 180

మోటార్ వాహనాల చట్టంలోని 180వ సెక్షన్ ప్రకారం ఒక మైనర్ కానీ, డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తి వాహనం నడిపితే అతడితో పాటు వారికి వాహనం ఇచ్చిన యజమానిని బాధ్యుడిని చేసే అవకాశం ఉన్నది. మైనర్ వాహనం ప్రమాదానికి గురైతేనే కాదు.. పోలీసుల తనిఖీల్లో దొరికినా తిప్పలు తప్పవు. 180వ సెక్షన్ కింద వీరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపే వీలు ఉన్నది. కోర్టులో నేరం రుజువైతే జైలు శిక్షతో పాటు, జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి.

బైక్ కొనివ్వాలని పిల్లల ఒత్తిడి

బైకులు, కార్లు నడుపుతున్న కొంతమంది యువకులు ఇంట్లో తల్లిదండ్రులను బైకులు కొనివ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. అలాంటివారు మొదట పోలీసులకు పట్టుబడితే వారితో పాటు తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. రెండోసారి పట్టుబడితే జైలుకు పంపుతామని హెచ్చరిస్తున్నారు. అలాగే ప్రైవేట్ సంస్థలు మొబైల్ యాప్ ద్వారా బైకులు, కార్లు కిరాయికి ఇవ్వొద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఇప్పటివరకు మైనర్ డ్రైవింగ్‌కు సంబంధించిన కేసులు అరుదుగా నమోదు చేశారు. మోటార్ వాహన చట్టం 180 ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు.

తూప్రాన్‌లో
దొంగల హల్‌చల్

- మూడు ఇళ్లలో చోరీ.. బంగారం, నగదు అపహరణ
- మరో మూడు ఇళ్లు, రెండు ఏటీఎంలలో చోరీకి యత్నం

తూప్రాన్, ఫిబ్రవరి 22: తూప్రాన్ పట్టణంలో దొంగలు హల్‌చల్ చేశారు. పలు ఇళ్లలో చోరీలకు పాల్పడడంతో పాటు రెండు ఏటీఎంలలో దోపిడీకి యత్నించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లి వద్దగల బ్యాంక్ ఆఫ్ బరోడా ఏటీఎంలో బుధవారం రాత్రి చోరీకి యత్నంచారు. సీసీ కెమెరా, లైట్లు, అలారం వైర్లు తొలగించారు. ఏటీఎం యంత్రాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. సమీపంలోనే ఉన్న మరో ఏటీఎం యంత్రాన్ని తెరిచేందుకు ప్రయత్నించారు. రెండు చోట్లా దొంగలు విఫలమయ్యారు. అలాగే, తూప్రాన్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. హష్మద్ బీ ఇంట్లో అర తులం బంగారం, రూ. 50 వేల నగదు, భాగ్య ఇంట్లో రూ. 10వేల నగదు, 20 తులాల వెండి ఆభరణాలు, సమ్యా సుల్తానా ఇంట్లో మూడు తులాల బంగారం, రూ. 20వేల నగదు చోరీ చేశారు. సమీపంలోని మరో మూడు ఇళ్లలో తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. గురువారం ఉదయం టాటాకాఫీ కాలనీలో ఓ ఇంటి యజమాని గొళ్లెం వేసి పెట్రోల్‌బంకుకు వెళ్లగా.. ఆయన వచ్చే లోపు దొంగలు చొరబడి 10.60 తులాల బంగారం, రూ. 10వేల నగదు దోచుకున్నారు. ఆయా ఘటనలపై పోలీసులు విచారణ చేపట్టారు. చోరీ జరిగిన ప్రదేశాల్లో తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్ఐ శివానందం పరిశీలించారు. క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వివరించారు.



తూప్రాన్‌లో దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీసులు



దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలను సేకరిస్తున్న పోలీసులు

నేడు బర్దీపూర్‌కు మంత్రి దామోదర్ రాక

ఝరాసంగం, ఫిబ్రవరి 22 : మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి శుక్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వస్తున్నారని ఆశ్రమ పీఠాధిపతి, వైరాగ్యశిఖామణి అవధూతగిరి మహరాజ్ తెలిపారు. ఆశ్రమంలో ప్రత్యేక పూజలతో పాటు ఆశ్రమ ఆవరణలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, అధికారులు, నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జన సంద్రమైన జంపన్నవాగు పరిసర ప్రాంతాలు



శిగాలూగుతున్న వనం



చిలుకలగుట్ట నుంచి సమ్మక్కను తీసుకువస్తున్న పూజారులు



సమ్మక్కకు మొక్కుగా గొర్రెపిల్లను ఎదుర్కోలు ఇస్తున్న భక్తుడు





సమ్మక్కగద్దె



- మేడారం జాతరకు పోటెత్తుతున్న భక్తులు
- గద్దెపైకి సమ్మక్క రావడంతో జోరుగా మొక్కులు
- ప్రశాంతంగా ముగిసిన అద్వితీయ ఘట్టం
- పతాక స్థాయికి 'వన' సంరంభం
- కిటకిటలాడిన తల్లుల గద్దెలు

మేడారం బృందం, ఫిబ్రవరి 22: సమ్మక్క - సారలమ్మ జాతరతో వనం శిగాలూగుతోంది. మేడారం భక్తిపారవశ్యంతో మురిసిపోతోంది. మహాజాతరలో తొలిరోజైన బుధవారం అర్ధరాత్రి సారలమ్మ గద్దెపై కొలువు దీరగా.. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రెండోరోజైన గురువారం ఉదయం నుంచి జరిగిన ప్రత్యేకపూజల అనంతరం మాఘశుద్ధ పౌర్ణమి వెలుగుల్లో చిలుకలగుట్ట నుంచి జనంలోకి వచ్చిన సమ్మక్క.. గద్దెపై కొలువుదీరారు. ఆ అమ్మ ఆగమనంతో జాతర పతాకస్థాయికి చేరింది. తల్లిని దర్శించుకునేందుకు ఎదురుచూసిన లక్షలాది భక్తులు భక్తి పారవశ్యంలో మునిగితేలారు. ప్రస్తుతం మేడారం పరిసరాల్లో కోటి మందికిపైగా భక్తులు విడిది చేసి ఉన్నారు. శుక్రవారం భక్తుల రాక రెట్టింపు కానుందని అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఎటుచూసినా ఇసుకేస్తే రాలనంత జనంతో మేడారం.. పుణ్యస్నానాలు చేసే వచ్చే భక్తులతో జంపన్నవాగు తీరం.. తల్లులను దర్శించుకుంటున్న భక్తులతో గద్దెల ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.

గద్దెపైకి సమ్మక్క

గురువారం రాత్రి సమ్మక్క గద్దెపైకి చేరుకోవడంతో జాతరలో ఓ అద్భుత ఘట్టం ఆవిష్కృతమైంది. ఉదయమే పూజారులు మేడారంలోని సమ్మక్క గుడిలో సమ్మక్కను తరలించే ప్రక్రియను ప్రారంభించి.. ప్రత్యేక పూజలు చేశారు. ఆ తర్వాత పూజారుల బృందం అడవికి వెళ్లి కంకవనాన్ని తీసుకురాగా.. ఈ తంతులో మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. కంకవనాన్ని సమ్మక్క గద్దెపై ఉంచి పూజలు చేశారు. సాయంత్రం సుమారు 5 గంటలకు ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య నేతృత్వంలో పూజారుల బృందం చిలుకల గుట్టకు బయలు దేరింది. మధ్యలో క్రిష్ణయ్య ఒక్కరే సమ్మక్క స్థావరం వద్దకు వెళ్లి పూజలు చేశారు. తల్లి కుంకుమ భరిణె రూపాన్ని తీసుకొని కిందకు చేరుకున్నారు. ఈ క్రమంలో ములుగు ఎస్పీ శబరీష్ గాల్లోకి కాల్పులు జరిపి వందనం సమర్పించారు. మంత్రి సీతక్క, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీష్, ఇతర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. రోప్ పార్టీ బలగాల సాయంతో పూజారులు సమ్మక్కను మేడారం గద్దెకు తోడ్కొని వచ్చారు. ఈ క్రమంలో భక్తులు పలు చోట్ల కోళ్లు, మేకలను బలి ఇచ్చారు. గద్దెల వద్ద సమ్మక్కను ప్రతిష్ఠించిన అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆ తర్వాత భక్తులకు దర్శనానికి అనుమతిచ్చారు. అయితే బుధవారమే సారలమ్మ, పగిడిద్ద రాజు, గోవిందరాజు గద్దెలపైకి చేరుకోగా.. సమ్మక్క రాకతో జాతరకు పరిపూర్ణత వచ్చింది. సమ్మక్క వన ప్రవేశం జరిగే శనివారం సాయంత్రం వరకు భక్తులు మొక్కులు చెల్లించుకోనున్నారు.

ప్రముఖుల రాక

గురువారం పలువురు ప్రముఖులు మేడారాన్ని సందర్శించారు. కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలు, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు పలువురు బీజేపీ నాయకులు తల్లులను దర్శించుకున్నారు. మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత తదితరులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం వేముల రేవంత్ రెడ్డి తదితరులు మేడారానికి వస్తున్నారు.

ఆర్కిటెక్చర్ రంగంలో జైకా, ఐఐటీహెచ్ సంయుక్త రూపకల్పనలు

- ఐఐటీహెచ్ వార్షిక ఫెస్ట్‌లో పాల్గొన్న 200 మంది డిజైనర్లు




ఆయాన్ సదస్సును ప్రారంభిస్తున్న ప్రతినిధులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 22: ఆర్కిటెక్చర్, డిజైన్ రంగాల్లో జపాన్ ఇంటర్‌నేషన్ కో ఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) హైదరాబాద్ ఐఐటీ ఇకపై సంయుక్తంగా కృషి చేస్తాయని భారత్ జైకా ప్రతినిధి సైటో పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది సమీపంలోని హైదరాబాద్ ఐఐటీహెచ్‌లో రెండు రోజులుగా డిజైన్ విభాగం ఆధ్వర్యంలో ఆయాన్ పేరుతో నిర్వహించిన సదస్సును గురువారం ముగిసింది. సదస్సులో 200 మంది యువ జాతీయ, అంతర్జాతీయ డిజైనర్లు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జైకా భారత్ ప్రతినిధి సైటో మాట్లాడుతూ ఆధునికమైన డిజైన్లు, వినూత్న ఆవిష్కరణలపై ఇకపై జైకా సారథ్యంలో టోకియో యూనివర్సిటీ హైదరాబాద్ ఐఐటీలు సంయుక్తంగా కృషి చేస్తాయన్నారు. ఆధునిక సవాళ్లను ఎదుర్కనే నూతన డిజైన్లు, సాంకేతిక పరిజ్ఞానం ఇచ్చిపుచ్చుకోవడంలో సంయుక్తంగా పనిచేస్తామన్నారు. సదస్సులో టోక్యో యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ హిడిటోషీవో హినో, జోసాయ్ యూనివర్సిటీ అధ్యక్షుడు డాక్టర్ యోజో ఫిజినో ఆర్కిటెక్చర్ రంగంలో తమ 50 ఏళ్ల అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- 'హవానా' ప్రారంభోత్సవంలో బీఎస్ఎన్ఎల్ జీఎం రాజేశ్వరి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజేశ్వరి

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 22 : టెలీకమ్యూనికేషన్స్ రంగంలో వీజీ సాంకేతికతను అమలు చేస్తున్న ప్రస్తుత తరుణంలో స్టార్టప్‌లను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని వర్ధమాన ఇంజనీర్లకు సంగారెడ్డిలోని భారతీయ సంచార నిగం (బీఎస్ఎన్ఎల్) ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ డి.రాజరాజేశ్వరి పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా రుద్రారం సమీపంలోని గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీలోని ఈఈసీఈ విభాగం ఆధ్వర్యంలో హవానా పేరిట నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ సాంకేతిక కార్యక్రమాన్ని గురువారం జ్యోతి ప్రజ్వలనతో ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్‌లో తన ఇరవై ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానం, అందులో సాంకేతిక పరిజ్ఞానం ఎదిగిన తీరును రాజేశ్వరి వివరించారు. గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వి.రామశాస్త్రి మాట్లాడుతూ ఇటీవల భారత నౌకదళంతో గీతం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుందని, త్వరలో వాయుసేనతోనూ అవగాహన ఒప్పందంపై సంతకం చేయబోతున్నట్టు తెలిపారు. సాంకేతికోత్సవంలో దేశ నలుమూలలకు చెందిన 30 కళాశాలల నుంచి దాదాపు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏటీవి ల్యాబ్స్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి గంగాధర్, ఫీనిక్స్ గ్లోబల్ సహ వ్యవస్థాపకుడు ఆయుష్ గోస్వామి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి.మాధవి, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాకిలే.. సమ్మక్క సారలమ్మ ఆలయం



కష్టపడితేకానీ కడుపు నిండని జీవులు తీర్థయాత్రకు వెళ్లే స్థోమత లేక, తామున్న చోటే దేవుడిని కొలుచుకుంటున్నారు. దుబ్బాక మండలం పెద్దగుండవెల్లి గ్రామంలో ఒడ్డెర వాడలో చాలా మంది సమక్క, సారలమ్మ జాతరకు వెళితే మరొకొంత మంది గురువారం పున్నమిరోజు ఇంటి వాకిలిలోనే అమ్మవార్లను వేడుకున్నారు. ఇంటి ఎదుట కల్లాపి చల్లి, వాకిలిలో పసుపు, కుంకుమ్మతో పూదించి కొబ్బరికాయలను నిలిపి సమక్క, సారక్కగా కొలుచుకున్నారు. కోడిపిల్ల, మద్యం బాటిల్‌ను ఎదురిచ్చి మొక్కు తీర్చుకున్నారు. ఆ తల్లులు అందరినీ మంచిగా చూసి, వచ్చే ఏటికైనా తన సన్నిధికి రప్పించుకుని, దర్శన భాగ్యం కల్పించాలని వేడుకున్నారు.

- దుబ్బాక, (ఆంధ్రజ్యోతి)ఫిబ్రవరి 22

పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యం

- ఓటరు నమోదుపై పూర్తి అవగాహన ఉండాలి
- శిక్షణ కార్యక్రమంలో మెదక్ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 22 : ఓటరు నమోదుపై క్యాంపస్ అంబాసిడర్‌లు పూర్తి అవగాహన కలిగి ఉండాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో క్యాంపస్ అంబాసిడర్‌లుగా గుర్తించిన విద్యార్థులకు స్వీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్యాంపస్ అంబాసిడర్‌లు ఈవీఎం, వీవీ ప్యాట్‌లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఫారం-6, 7, 8తో పాటు 6ఏ, 6బీలలో నూతన ఓటరుగా నమోదు, మార్పులు, చేర్పులు, పుట్టిన తేదీ, ఫొటో, అడ్రస్, ఆధార్ లింక్‌లను నమోదు చేయాలన్నారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటింగ్ శాతం పెంపు కోసం కళాశాలల్లో రంగోలి, ఉపన్యాస, డ్యాన్స్, నాటకం లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో 100 శాతం ఓటింగ్ నమోదు లక్ష్యంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, వివిధ కళాశాల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలపై వివక్ష చూపితే ఫిర్యాదు చేయాలి

ఆడపిల్లలపై వివక్ష చూపితే టోల్ ఫ్రీ నంబర్ 1098కు ఫిర్యాదు చేయాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష జాఢ్యాన్ని రూపుమాపాలంటే వ్యవస్థలో మార్పు రావాలని, అందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలన్నారు. ఆడపిల్లలను చదివిస్తే సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. పాఠశాల విద్యార్థినులకు చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. తల్లిదండ్రులు, టీచర్లు స్నేహభావంతో ఉన్నప్పుడు సమాజంలో అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యలను వారితో ధైర్యంగా చెప్పగలుగుతారన్నారు. అధికారులు, ఎన్జీవోలు క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అనంతరం 'బాలికను బతకనిద్దాం... చదవనిద్దాం, బంగారు తెలంగాణకు బాటలు వేద్దాం' అని కలెక్టర్ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా బేటీ బచావో, బేటీ పడావో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఈవో రాధాకిషన్, డీవైఎస్‌వో నాగరాజు, డీడబ్ల్యూవో బ్రహ్మాజీ, మెప్మా పీడీ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్టు

- సెంట్రింగ్ సామగ్రి చోరీకి పాల్పడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- వివరాలు గజ్వేల్ ఏసీపీ బాలాజీ

వర్గల్, ఫిబ్రవరి 22 : సెంట్రింగ్ సామగ్రి చోరీకి పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠా సభ్యులలో ఇద్దరిని గౌరారం పోలీసులు పట్టుకున్నారు. అశోక్ లీలాండ్ వాహనంతో పాటు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ ఏసీపీ బాలాజీ గౌరారం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. వర్గల్ మండలం రాజీవ్‌రహదారి వర్గల్ కమాన్ వద్ద గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గౌరారం ఎస్ఐ శివకుమార్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా అశోక్ లీలాండ్ వాహనం హైదరాబాద్ నుంచి ప్రజ్ఞాపూర్ వైపు వెళుతూ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించారు. వారిని పోలీసులు పట్టుకుని విచారించారు. నల్గొండ జిల్లా నెరిడిగొమ్ము మండలంలోని పడమటి తండాకు చెందిన ముడావత్ హరి(28), మల్లెపల్లి మండల పరిధి దేవరకొండ గాజీనగర్ గ్రామానికి చెందిన జరపుల రాంలాల్(33)ను అరెస్టు చేశారు. వీరితో పాటు మరో 17 మంది ముఠాలుగా ఏర్పడి సిద్దిపేట, మెదక్ జిల్లాలో భవన నిర్మాణాలు జరిగే చోట సెంట్రింగ్ సామగ్రిని దొంగతనం చేసి హైదరాబాద్‌లోని స్క్రాప్ దుకాణంలో అమ్మేవారు. వారు గౌరారం పోలీస్‌స్టేషన్‌తో పాటు గజ్వేల్, సిద్దిపేట-1టౌన్, సిద్దిపేట-3టౌన్, మెదక్ జిల్లాలోని కౌడిపల్లి, శివంపేట, మెదక్ రూరల్, నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 11 చోట్ల చోరీలకు పాల్పడ్డారు. మరో 17 మంది ముఠా సభ్యులు పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఏసీపీ తెలిపారు.

జహీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఆగమ సాయిచరణ్



సాయిచరణ్

జహీరాబాద్, ఫిబ్రవరి 22 : నామినెటేడ్ పోస్టుల భర్తీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం గురువారం జహీరాబాద్ వ్యవసాయశాఖ మార్కెట్ కమిటీని ఖరారు చేసింది. చైర్మన్‌గా ఆగమ సాయిచరణ్‌ను నియమించింది. ఉపాధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి, సభ్యులుగా కలాల్ నరేష్‌గౌడ్, కిషన్‌రాథోడ్, అల్లూరి వంశీరాజ్, కండెం సుజాత, మహ్మద్ జాఫర్, బోయిని శేఖర్, ఎం.అశోక్, మహ్మద్ అఖిల్ అహ్మద్, అంజద్‌మియా, పట్లోళ్ల మల్లారెడ్డి, రాయికోడ్ నర్సింలు, శంకరప్పపాటిల్‌ను నియమిస్తూ మార్కెటింగ్ శాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. బీఆర్ఎస్ హయాంలో ఐదారేళ్లుగా కమిటీని ఏర్పాటు చేయలేదు.

ఇవి.. వనాలేనా?

- ఎండిపోయిన మొక్కలు ● నిర్వహణ లేక నిరుపయోగం

మద్దూరు, ఫిబ్రవరి 22 : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి, బృహత్ పల్లె ప్రకృతి వనాలు నిర్వహణ లేక అధ్వానంగా మారాయి. మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని 23 గ్రామపంచాయతీల్లో గ్రామాలకు దగ్గరగా కొన్ని, దూరంగా మరికొన్ని స్థల లభ్యతను బట్టి ఐదు గుంటల నుంచి ఎకరంలో పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. దూళిమిట్ట, మద్దూరు, నర్సాయపల్లి, మర్మాములలో బృహత్ పల్లె ప్రకృతి వనాలున్నాయి. ఉపాధిహామీ ద్వారా రెండేళ్ల మేంటెనెన్స్ పూర్తవ్వడంతో గ్రామ పంచాయతీలు ప్రకృతి వనాల నిర్వాహణ బాధ్యతలను విస్మరించడంతో ఇవి వృథాగా మారుతున్నాయి.

నాడు మొక్కల కొనుగోలులో అవకతవకలు

పల్లె ప్రకృతి వనంలో సుమారు 1800 నుంచి 2 వేలు, బృహత్ పల్లె ప్రకృతి వనంలో 10 నుంచి 12 వేల మొక్కలను నాటినట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కలే కాకుండా, ఇతర ప్రాంతాల నుంచి ఒక్కో మొక్కకు సుమారు రూ.250పైనే వెచ్చించారు. గ్రామపంచాయతీ నిధులు ఖర్చు చేసి మొక్కలను కొనుగోలు చేశారు. మొక్కల కొనుగోలులో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంలో ఇన్‌చార్జీ ఎంపీడీవోగా పనిచేసిన అప్పటి పంచాయతీ విస్తరణాధికారి హస్తం ఉన్నట్లు ఆరోపిస్తూ బదిలీ చేశారు.

రెండేళ్ల మేంటెనెన్స్‌కు రూ.58.53 లక్షలు

ఉపాధిహామీ ద్వారా రెండేళ్ల నిర్వహణ చేపట్టగా మొక్కల సంరక్షణకు వాచర్లను నియమించారు. పల్లె ప్రకృతి వనాలకు ఒకరు, బృహత్ పల్లె ప్రకృతి వనాలకు ఇద్దేరిసి చొప్పున తీసుకున్నారు. ఒక్కో వాచర్‌కు రోజుకు నెలకు రూ.6,168 చెల్లిస్తున్నారు. రెండేళ్లకు వాచర్లకు రూ.47.37 లక్షల జీతాలు చెల్లించారు. మొక్కలకు ట్యాంకర్ ద్వారా అందించే నీరే దిక్కుగా మారాయి. పల్లె ప్రకతి వనానికి నెలకు మూడు ట్యాంకర్లు, బృహత్ పల్లె ప్రకృతి వనాలకు ఆరు చొప్పున ట్యాంకర్‌ల ద్వారా నీటిని అందించారు. 93 ట్యాంకర్లకు నెలకు రూ.46,500 చొప్పున రెండేళ్లకు రూ.11.16 లక్షలు ఖర్చు చేశారు. రెండేళ్ల నిర్వహణ కోసం దాదాపుగా రూ.58.53 లక్షలను ఖర్చు చేశారు. అయితే ఉపాధిహామీ ద్వారా రెండేళ్ల మేంటెనెన్స్ పూర్తవ్వడంతో మొక్కలన్నీ ఎండిపోతున్నాయి. గ్రామపంచాయతీ నిర్వహణ చర్యలను చేపట్టకపోవడంతో వనాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి.







మొక్కలే లేని మర్మాములలోని బృహత్ పల్లె ప్రకృతి వనం, ప్రకృతి వనంలో నీళ్లు లేక ఎండిపోతున్న మొక్కలు, రేబర్తిలో గేటు వద్ద మురుగు నీరు

ఏడుపాయల అభివృద్ధికి రూ.80లక్షలు

మెదక్, ఫిబ్రవరి 22: ఏడుపాయల వనదుర్గా మాత ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే రోహిత్ నిధుల నుంచి రూ.80లక్షలు కేటాయించారని కాంగ్రెస్ నేతలు తెలిపారు. గురువారం మెదక్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏడుపాయలలో భక్తుల కోసం శాశ్వత షెడ్డు నిర్మాణం చేపట్టనునట్లు తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని జరిగే జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్ దొంతి లక్ష్మి ముత్యంగౌడ్, నాయకులు జీవన్‌రావు, బొజ్జ పవన్, గూడూరి ఆంజనేయులు, బట్టి సులోచన, గోదల జ్యోతికృష్ణ, హరిత, గాడి రమేష్, రవి, దేవ్‌లా మన్సూర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

● మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య

శివ్వంపేట, ఫిబ్రవరి 22: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య సూచించారు. గురువారం శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో ఉపాధి కూలీలకు పని కల్పించేలా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది కృషి చేయాలన్నారు. సీఈవో తనిఖీ సమయంలో ఎంపీడీవో నాగేశ్వర్ లేకపోవడం విశేషం. సీఈవోగా బాధ్యతలు తీసుకున్న తర్వాత మొదటిసారి శివ్వంపేటకు వచ్చిన ఎల్లయ్యను ఎంపీపీ హరికృష్ణ సన్మానించారు.

అద్దె భవనంలో సిబ్బంది అవస్థలు

● జోగిపేట సీడీపీవో ప్రాజెక్టు పరిధిలో 500 మందికి పైగా విధుల నిర్వహణ

● నిధులొచ్చినా సొంత భవన నిర్మాణం చేపట్టని వైనం

జోగిపేట, ఫిబ్రవరి 22: జోగిపేటలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం అద్దె భవనంలో ఇరుకు గదుల్లో కొనసాగుతున్నది. దీంతో సిబ్బంది కొరత కూడా ఉండడంతో సమస్యలకు కేరాఫ్ అడ్రస్‌గా తయారైంది. పన్నెండేళ్ల క్రితం వరకూ ఎంపీడీవో కార్యాలయంలోని ఓ పెద్ద హాలు, సీడీపీవో గదిలో ఈ కార్యాలయం కొనసాగేది. అక్కడ ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో సీడీపీవో అక్కడి నుంచి అద్దె భవనంలోకి తరలించారు. జోగిపేట కేంద్రంగా ఏర్పాటైన సీడీపీవో కార్యాలయ పరిధిలో అందోలు-జోగిపేట మున్సిపాలిటీతో పాటు అందోలు, పుల్కల్, చౌటకూరు, వట్‌పల్లి, హత్నూర మండలాలున్నాయి. 254 ప్రధాన, 8 మినీ సెంటర్లు కలిపి 262 అంగన్‌వాడీ కేంద్రాలతో ఈ ప్రాజెక్టు ఆఫీస్ కొనసాగుతున్నది. 254 మంది అంగన్‌వాడీ టీచర్లు, 262 మంది ఆయాలతో పాటు 10 మంది సూపర్‌వైజర్లు, కార్యాలయంలో 10 మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. కానీ సొంత భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



జోగిపేటలో అద్దె భవనంలో కొనసాగుతున్న సీడీపీవో కార్యాలయం

రెండు గదుల్లోనే..

అద్దె భవనంలో కొనసాగుతున్న సీడీపీవో కార్యాలయంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కేవలం రెండు ఇరుకు గదుల్లోనే సీడీపీవో సహా 10 మంది సూపర్‌వైజర్లు, మరో 10 మంది కార్యాలయ సిబ్బంది పనిచేస్తున్నారు. ఒక గోదాంలో రెండు షట్టర్లలోనే ఈ కార్యాలయం కొనసాగుతుండడం విడ్డూరం. కార్యాలయంలో ఎక్కువ మంది మహిళలే పనిచేస్తున్నారు. కార్యాలయంలో కనీసం మరుగుదొడ్లు కూడా లేకపోవడంతో ఉద్యోగుల ఇబ్బందులు వర్ణనాతీతం. ఇటీవలే వచ్చిన ఓ అధికారిణి కోరిక మేరకు భవన యజమాని టాయిలెట్లను, షట్టర్‌ను రెండు గదులుగా మార్చి ఇచ్చాడు.

జోగిపేటతో పాటు పటాన్‌చెరు, నారాయణఖేడ్ ప్రాజెక్టులకు ఆరేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నూతన భవనాల నిర్మాణాలకు నిధులు విడుదల చేసింది. జోగిపేటలోని ప్రాజెక్టు కార్యాలయం కోసం రూ.40 లక్షలు మంజూరయ్యాయి. సీడీపీవో భవనాన్ని ప్రత్యేకంగా నిర్మించకుండా ఎంపీడీవో కార్యాలయంలోనే సమీకృత భవనం నిర్మిద్దామని అప్పటి ఎమ్మెల్యే బాబుమోహన్ భావించారు. దీంతో సీడీపీవో భవన నిర్మాణం జరగలేదు. ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు సమీకృత భవన నిర్మాణం కూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో సీడీపీవో భవన నిర్మాణం కోసం మంజూరైన రూ.40 లక్షలు వెనక్కి వెళ్లిపోయాయి. ఎమ్మెల్యే సూచనతో సీడీపీవో భవనం నిర్మాణానికి నోచుకోక, సమీకృత కార్యాలయం ఏర్పాటు కాక సిబ్బంది అవస్థలు పడుతున్నారు. మంత్రి దామోదర్ సమస్యను పరిష్కరించాలని సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

కుటుంబ సభ్యులు మందలించారని ఆత్మహత్య


రాయగిరి (ఫైల్)

కౌడిపల్లి, ఫిబ్రవరి 22: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కొట్టాలలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. కొట్టాల గ్రామానికి చెందిన గుమ్మల రాయగిరి(45) ఐదు రోజుల క్రితం కుటుంబీకుల కాళ్ల కడియాలు అమ్మేశాడు. దీంతో రాగిరి భార్య, తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురైన రాయగిరి బుధవారం రాత్రి కుటుంబీకులు నిద్రించిన అనంతరం ఇంటి పక్కన ఉన్న గుడిసెలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కౌడిపల్లి ఎస్ఐ రంజిత్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో యువకుడు..

● రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి.. మృతదేహంగా లభ్యం


రమేష్ (ఫైల్)

రామాయంపేట, ఫిబ్రవరి 22: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామాయంపేటలో గురువారం వెలుగు చూసింది. పట్టణానికి చెందిన దాకి రమేష్(30) ఈ నెల 20న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం మధ్యాహ్నం రామాయంపేట-సిద్దిపేట మార్గంలోని మల్లె చెరువులో మృతదేహం తేలియాడుతున్నట్లు అటుగా వెళ్లిన వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి, దాకి రమేష్‌గా గుర్తించారు. కాగా మృతుడు ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేసేవాడు. అవసరాల నిమిత్తం చేసిన అప్పులు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రంజిత్ తెలిపారు. రమేష్‌కు భార్య మాధవి, ఇద్దరు ఐదేళ్లలోపు పిల్లలు ఉన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



అల్గోల్ గురుకులంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

జహీరాబాద్, ఫిబ్రవరి 22: అగ్ని ప్రమాదాలపై అందరు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి ప్రశాంత్ పేర్కొన్నారు. అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని అల్గోల్ గ్రామంలో గల బాలుర మైనార్టీ గురుకుల కళాశాలలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్లల్లో జరిగే షార్ట్ సర్క్యూట్, గ్యాస్ సిలిండర్‌లు లీకై మంటలు ఎగిసిపడడం, ఇతర అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అత్యవసర సమయంలో 101 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్‌లు జమీల్, రాములు, అగ్నిమాపక సిబ్బంది శ్రీనివాస్, రఫీయోద్దీన్, సిద్దయ్య, అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల వార్షికోత్సవం

రామచంద్రాపురం, ఫిబ్రవరి 22: పటాన్‌చెరు నియోజకవర్గంలోని శ్రీ గీతా భూపాల్‌రెడ్డి ప్రభుత్వ కళాశాల 16వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. జడ్పీ ఛైర్‌పర్సన్ మంజుశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వి.భూపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. భూపాల్‌రెడ్డి తన సొంత నిధులతో పాటు స్నేహితుల సహకారంతో కళాశాల భవనం పూర్తి చేయడం అభినందనీయమని పలువురు అన్నారు. ఈ సందర్భంగా క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర్, కార్పొరేటర్లు వి.సింధూఆదర్శరెడ్డి, పుష్పనగేష్, మెట్టు కుమార్, తొంట అంజయ్య, గూడెం మధుసుధన్‌రెడ్డి, యాదగిరి యాదవ్, పరమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు జరిపితే కేసులు

జిన్నారం, ఫిబ్రవరి 22: ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ భిక్షపతి హెచ్చరించారు. గురువారం మాధారం 620 సర్వే నంబరులోని అసైన్డ్ భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ జయప్రకాష్, పంచాయతీ కార్యదర్శి నవీన్ పరిశీలించారు. అక్కడ ప్లాట్లుగా మార్చి, ఏర్పాటు చేసిన హద్దు రాళ్లను తొలగింపజేశారు. భూమిని రక్షించాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కాగా గ్రామకంఠం భూముల్లోనూ ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కాగా మాధారం పరిధిలోని ఓ స్టోన్ క్రషర్‌ను తహసీల్దార్, ఆర్ఐ పరిశీలించారు. భారీ ఎత్తున పేలుళ్లు, వాయు కాలుష్యంతో ఇక్కట్లు పడుతున్నామని ఇటీవల స్థానికులు ధర్నా చేశారు. తహసీల్దార్, ఆర్ఐ క్రషర్‌ను సందర్శించి, యాజమాన్యం వద్ద గల అనుమతులు పరిశీలించారు. అనుమతికి మించి పేలుళ్లు జరుపవద్దని సూచించారు.

వైద్య సిబ్బందికి పల్స్ పోలియోపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న ఆశవర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు

చేగుంట, ఫిబ్రవరి 22: నార్సింగి మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య సిబ్బందికి పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ.. మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా అన్ని గ్రామాల్లో చాటింపు వేయాలన్నారు. మండల వ్యాప్తంగా 15 బృందాలు ఏర్పాటు చేసి, విజయవంతం చేయాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల పిల్లల వరకు రెండు చుక్కల పోలియో మందు వేయించాలని సూచించారు. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలియో చుక్కల కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందం సబితారవీందర్, తహసీల్దార్ షేక్ కరీం, ఎంపీవో నరేష్, ఎంపీటీసీ సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వండి

● చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు: సీఐ శ్రీధర్‌రెడ్డి

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 22: సంగారెడ్డి పట్టణంలో అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని వారిని కొట్టడం లాంటివి చేయరాదని సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.శ్రీధర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. చిన్నపిల్లలను కిడ్నాప్ చేస్తున్న గ్యాంగులు వచ్చాయని వదంతులు వస్తున్నాయని, వాటిని నమ్మి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారన్నారు. అనుమానిత వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే పోలీసులకు లేదా 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచిత వ్యక్తులను కిడ్నాపర్లనే అనుమానంతో కొట్టడం లాంటివి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

వట్‌పల్లి, ఫిబ్రవరి 22: మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులను గురువారం మండల కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ పనులను మంత్రి ప్రారంభించాల్సి ఉండగా.. అనివార్య కారణాల వల్ల కుదరకపోవడంతో ఆయన ఆదేశాల మేరకు పార్టీ మండలాధ్యక్షుడు రమేష్ జోషి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులే ప్రారంభించారు. రూ.కోటి30 లక్షలతో గౌతాపూర్ నుంచి గొర్రెకల్ వరకు మట్టి రోడ్డు పనులను, ఖాదిరాబాదులో రూ.25లక్షలతో సీసీరోడ్డు పనులను, గొర్రెకల్‌లో రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మహేష్ చౌహాన్, కాంగ్రెస్ నాయకులు వీరన్న, పోలీస్ శేఖర్, బసవరాజ్, విజేందర్‌రెడ్డి, లింగారెడ్డి, అమృత్, సత్యం, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ

చేగుంట, ఫిబ్రవరి 22: చేగుంట ఐకేపీ కార్యాలయంలో గురువారం మండలంలోని మహిళా సంఘాల సభ్యులకు, వీవోలకు, సీసీలకు ఆదాయ వనరులు పెంపొందించుకోవడానికి అధికారులు శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రకాష్ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు ద్వారా పొందిన రుణాలతో వ్యాపారాలు చేసి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రకాష్, లాలూనాయక్, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ పాల్గొన్నారు.

బీమా చెక్కును అందజేసిన మాజీ ఎమ్మెల్యే

కల్హేర్, ఫిబ్రవరి 22: మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మెట్టుకుంట తండాకు చెందిన బీఆర్ఎస్ క్రియాశీలక కార్యకర్త విఠల్‌నాయక్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. బీఆర్ఎస్ పార్టీ తరఫున మంజూరైన రూ.2లక్షల విలువ చేసే బీమా చెక్కు మంజూరైంది. ఆ చెక్కును విఠల్ నాయక్ భార్య పిప్లిబాయికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి గురువారం ఖానాపూర్(కె) గ్రామంలో అందజేశారు. కార్యక్రమంలో కల్హేర్ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి అలీ, ఎంపీటీసీ గుండమ్మ అంజయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రాములు, మోహన్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో భారత్ ఖేలో ముగింపు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 22: ఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో ఖేలో భారత్ ఖేలో ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, చెస్, క్యారం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను ముఖ్య అతిథులు అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు జానారెడ్డి, ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ ప్రసాద్, జ్ఞానేశ్వర్, నాగ్‌నాథ్‌రావు, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్, బీజేపీ, ఏబీవీపీ నాయకులు రాజు, నిఖిల్, వెంకట్, దశరథ్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, పట్నంమాణిక్, ప్రశాంత్ పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.20లక్షలు

హత్నూర, ఫిబ్రవరి 22: సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల పునర్‌నిర్మాణం కోసం సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని పాఠశాల కమిటీ సభ్యులు ఇటీవల హత్నూర మండలం గుండ్లమాచునూర్ గ్రామ శివారులోని కోవలెంట్ లేబరేటరీస్ పరిశ్రమ యాజమాన్యాన్ని కలిసి అర్జీ పెట్టారు. స్పందించిన పరిశ్రమ యాజమాన్యం రూ.20లక్షల చెక్కును గురువారం అందజేశారు. కార్యక్రమంలో పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ విష్ణువర్ధన్‌రెడ్డి, పాఠశాల కమిటీ సభ్యులు గోనెల రఘు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22: ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ తెలంగాణ ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ, టీఎస్‌జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు జైపాల్‌రెడ్డి, తెలంగాణ సమాఖ్య కన్వీనర్ పడాల యాదగిరి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, విరేశం, సంయుక్త కార్యదర్శి రమేష్, నాయకులు శివకుమార్, శ్రీనివాస్, మల్లేశం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సురేఖ కోలుకోవాలని పూజలు

చేగుంట, ఫిబ్రవరి 22: వైరల్ ఫీవర్‌తో బాధపడుతున్న మంత్రి కొండా సురేఖ త్వరగా కోలుకోవాలని కర్నాల్‌పల్లి శిరిడి సాయిబాబా ఆలయంలో బి.కొండాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అల్లి అంజిరెడ్డి, చిన్నశివనూర్ పలు గుల్లా రమేష్‌కుమార్, బోనాల కొండాపూర్ పాల్గొన్నారు.

నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేయాలి

● టీఎస్ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ జానకీరాములు

మెదక్ అర్బన్/ తూప్రాన్, ఫిబ్రవరి 22: వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని టీఎస్ ఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జానకీరాములు ఆదేశించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు గురువారం మెదక్ జిల్లా కార్యాలయంతోపాటు తూప్రాన్‌లో విద్యుత్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు, వ్యాపారులు, వినియోగదారులందరికీ నాణ్యమైన విద్యుత్‌ను సంపూర్ణంగా అందించేందుకు డిస్కం సిద్ధంగా ఉన్నదని తెలిపారు. రైతులకు గతం కంటే మెరుగ్గా మరిన్ని గంటల పాటు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ లైన్‌లలో సమస్యలపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ సరఫరా ప్రణాళికబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు హెడ్ క్వార్టర్స్‌లో అందుబాటులో ఉంటూ సరఫరాను పర్యవేక్షించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో మెదక్, తూప్రాన్ డీఈలు కృష్ణారావు, రాజేందర్, ఏడీఈలు మోహన్‌బాబు, రాజమల్లేశం, ఏఈలు జావేద్, వరహాలబాబు, వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్షలో మాట్లాడుతున్న జానకీరాములు

కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ కార్యకర్తకూ గుర్తింపు

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి

చేగుంట, ఫిబ్రవరి 22: కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతీ కార్యకర్తకూ గుర్తింపు దక్కుతుందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు పన్యాల శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చేగుంట మండలం వడియారంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలుగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాల అమలులో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉండి దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం తోడ్పడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ సంజీవరెడ్డి, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, బాలకృష్ణ, స్వామి, రాజిరెడ్డి, చింత వెంకట్, రాజు, వివిధ మండలాల కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రవణ్‌కుమార్‌రెడ్డి

లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలి

● జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు



బ్యాంకు, ఇన్సూరెన్స్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి ప్రభాకర్‌రావు

సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 22: మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు కోరారు. బ్యాంకు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్ అధికారులతో జిల్లా కోర్టు సమావేశ మందిరంలో గురువారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాక్సిడెంట్ల కేసులు, బ్యాంకు మొండి బకాయిలు, చిట్‌ఫండ్ కేసులతో పాటు రాజీపడే అన్ని కేసులు పరిష్కారమయ్యే విధంగా చూడాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం, సమన్యాయం జరుగుతుందన్న విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జె.హన్మంతరావు, బ్యాంకు, ఇన్సూరెన్స్, చిట్‌ఫండ్ సంస్థల అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

● మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22: గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. గురువారం చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు జంగరాయి, చందాపూర్, చందంపేట గ్రామాలకు చెందిన 72 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అలాగే దర్పల్లి గ్రామంలోని నాబిశల సహిత (బొడ్రాయి) ఊరడమ్మ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తన సమస్యగా భావించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యలక్ష్మిగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ మన్నన్, ఎంపీడీవో దామోదర్, ఎంపీటీసీ శివకుమార్, మాజీ సర్పంచులు రాజీరెడ్డి, రంగారావు, సిద్ధిరాములు, సొసైటీ మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


చిన్నశంకరంపేటలో కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

'పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి'

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 22: 2024 విద్యాసంవత్సరానికి గాను పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 15నుంచి దరఖాస్తులు ప్రారంభం కాగా ఏప్రిల్ 22వరకు అవకాశం ఉన్నదన్నారు. ఏప్రిల్ 24 వరకు రూ.100 అపరాధ రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఇతర వర్గాల వారు రూ.500 చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 22: చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి గ్రామంలో రామలింగేశ్వర ఆలయ ద్వితీయ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఉదయం గణపతి పూజ, శివలంగార్చణ, అభిషేక, పుష్పార్చణ నిర్వహించారు. చండి హోమం పూజలో దంపతులు కూర్చోని పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఎమ్మెల్యే రోహిత్‌రావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మాజీ ఉప సర్పంచ్ రామ్‌రెడ్డి పాల్గొన్నారు.


రాజిపేట్‌లోని శివపంచాయత హనుమాన్ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

రాజిపేట్‌లో

కౌడిపల్లి: రాజిపేట్‌లోని శివపంచాయత హనుమాన్ ఆలయంలో గురువారం మొదటి వార్షికోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా విఘ్నేశ్వర పూజ, హోమం, స్వస్తిపుణ్యావచనం, మండపారాధన, స్వామివారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లింగంగౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగారాంగౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఊరట్ల శివ, మహ్మద్‌నగర్ సొసైటీ డైరెక్టర్ మల్లేశం పాల్గొన్నారు.

లక్ష్మీపతిగూడెంలో

జిన్నారం: లక్ష్మీపతిగూడెంలో ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.


గవ్వపల్లి రామలింగేశ్వర ఆలయంలో శివపార్వతుల కల్యాణం జరుపుతున్న పండితులు

ఉత్సవాల్లో ఎమ్మెల్యే రోహిత్

పాపన్నపేట: మండల పరిధిలోని పోడ్చన్‌పల్లిలో గురువారం నిర్వహించిన విఠలేశ్వర స్వామి ఆలయ ఉత్సవాల్లో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, సిరాజ్, సూఫీ, తదితరులు ఉన్నారు.